పీహెచ్‌సీలో ఆధిపత్య పోరు

ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు, సిబ్బంది మధ్య ఆధిపత్యపోరు తారస్థాయికి చేరింది. వీరంతా రెండు వర్గాలుగా విడిపోయి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోగులకు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గతంలో జరిపిన విచారణలపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం కూడా వీరి ఆధిపత్య పోరుకు ఆజ్యం పోస్తోంది.

- రోగుల వైద్యం గాలికొదిలేసిన వైద్యులు
- పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్లు
- వైద్య ఆరోగ్యశాఖాధికారుల విచారణ



ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం (ఇన్‌సెట్) అధికారులపై విచారణ వివరాలు మీడియాకు తెలుపుతున్న ఏ డీఎంహెచ్‌ఓ ఉషారాణి, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ ఇందుమతి (ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లతో కలిపి మొత్తం 35 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రోగులకు వైద్యం అందించాల్సిన వీరు ఫీల్డ్ వర్క్‌కు వచ్చే నిమ్రా మెడికల్ కళాశాల విద్యార్థులకు ఆ విధులను వదిలేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతి రోజూ సుమారు 80 నుంచి 100 మంది అవుట్ పేషెంట్లు వైద్యశాలకు వస్తుంటారు. వీరితో పాటు నెలకు సుమారు 8 నుంచి 10 కాన్పుల వరకు జరగాల్సి ఉంది. మెరుగైన వైద్యం అదించాల్సిన వైద్యాధికారులు రోగులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాన్పుల సమయంలో వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన గర్భిణులు అదృష్టవశాత్తు బతికి బయటపడ్డారని చెబుతున్నారు. నాలుగు నెలల కిందట ఓ మహిళ చేతులు లాగేస్తున్నాయని తన ఇంట్లో స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షలు జరిపిన వైద్యులు గ్యాస్ సమస్యగా చెప్పి మందులు రాసి పంపారు. మరుసటి రోజు తెల్లవారు జామున నిద్రలోనే గుండెపోటుతో మహిళ మృతిచెందింది. వైద్యశాల ఎదురుగా ఉన్న ప్రైవేట్ క్లినిక్‌లో ఈసీజీ తీయించి ఉంటే ఆమె బతికి ఉండేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. డాక్టర్లు వ్యక్తిగత పనుల్లో నిమగ్నమై పీహెచ్‌సీకి వచ్చే రోగులను ఎంఎల్‌హెచ్‌పీలు, నిమ్రా వైద్య కళాశాల నుంచి ఫీల్డ్ వర్క్‌కు వస్తున్న ఎంబీబీఎస్ విద్యార్థులతో చికిత్స చేయించడం వలన ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు చెబుతున్నారు.

వివాదాల మయం

రోగులకు సదుపాయాలు కల్పించడంలో అనేక లోపాలు ఉన్నప్పటికీ విలాసాల కోసం కొన్ని రూముల్లో ఏసీలు ఏర్పాటు చేశారని ప్రచారం సాగుతోంది. గ్రామాల్లో విధులు నిర్వహించాల్సిన సిబ్బంది ఏసీ గదుల్లో కూర్చుని కాలం వెళ్లదీస్తున్నారని వైద్య సిబ్బందే ఆరోపణలు చేయడం గమనార్హం. రోగులకు మాత్రం ఆరుబయట బెడ్లు వేసి సెలైన్ బాటిల్స్ ఎక్కించడం బాధాకరం. అధికారుల అనుమతి లేకుండా భారీ వృక్షాలు నరికివేత నుంచి 104 పైలెట్‌ను తొలగించడం, కాన్పులు, గర్భిణులకు ప్రైవేట్ సెంటర్లలో స్కానింగ్ తీయించడం, వైద్య సేవల్లో లోపాలు, నిమ్రా విద్యార్థులు, ఎంఎల్‌హెచ్‌పీలతో వైద్య చేయించడం, ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడం వంటి అనేక వివాదాల నడుమ వైద్యశాల నడుస్తోంది.

ఆరోపణలపై విచారణ

కాన్పుల సమయంలో నవజాత శిశువులు మృతిచెందుతున్నారని ఓవ్యక్తి జిల్లా ఆరోగ్య శాఖాధికారులకు ఫిర్యాదు చేశాడు. 104 వాహన పైలెట్ తొలగింపులో కూడా వైద్యశాల అధికారుల హస్తం ఉందని ఆ డ్రైవర్ జిల్లా అధికారులను ఆశ్రయించాడు. వైద్యశాల ఆవరణలో పెరిగిన భారీ వృక్షాలను ఫారెస్ట్, రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా నరికి వేయించిన పీహెచ్‌సీ వైద్యాధికారి సయ్యద్ పర్వీన్ విచారణ ఎదుర్కోవడంతో పాటు ఫారెస్ట్ శాఖకు పెనాల్టీ కట్టాల్సి వచ్చింది. ఆరోపణలపై అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఉషా రాణి, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి విచారణ జరిపారు.

సిబ్బందిలో సమన్వయ లోపం

వైద్యశాల సిబ్బందిలో సమన్వయం లోపించింది. ప్రతి విషయానికి నేను బాధ్యురాలిని అవుతున్నాను. కనీసం రిపోర్టులు తయారు చేయలేని వారితో ఇబ్బందులు వస్తున్నాయి. నవజాత శిశువుల మరణాలపై కావాలని నాపై పుకార్లు పుట్టించారు. మెడికల్ బోర్డు ఉత్తర్వుల మేరకే నిమ్రా మెడికల్ విద్యార్థులతో ప్రాథమిక వైద్యం చేయిస్తున్నాం. ఈ అంశాలపై పీహెచ్‌సీలో నాతో పాటు కొంత మందిపై శాఖాపరమైన విచారణ జరిగింది.

– సయ్యద్ పర్వీన్, పీహెచ్‌సీ వైద్యాధికారి

ముమ్మరంగా వరి కోతలు



నూజివీడులో వరిని కోస్తున్న యంత్రం

నూజివీడు: నియోజకవర్గంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో 22 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. మండలాల వారీగా నూజివీడులో 3,000, ఆగిరిపల్లిలో 8,000, చాట్రాయిలో 7,500, ముసునూరులో 3,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. నూజివీడు మండలం నూజివీడు, ముక్కొల్లుపాడు, బోర్వంచ, పల్లెర్లమూడి, మొర్సపూడి, మీర్జాపురం తదితర గ్రామాల్లో వరి కోతలు కొనసాగుతున్నాయి. ధాన్యానికి కనీస మద్దతు ధర సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.2,300, ఏ గ్రేడ్‌కు రూ.2,320 ఉంది. నూజివీడు మండలంలో ఇప్పటికే 9 చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 195 టన్నుల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

యంత్రాలతో మాసూళ్లు..
వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడంతో రైతులు యంత్రాలతో వరి మాసూళ్లు చేయిస్తున్నారు. యంత్రానికి గంటకు రూ.3 వేలు చెల్లిస్తుండగా గంటలో ఎకరం వరకు కోత కోస్తుందని చెబుతున్నారు. యంత్రంతో కోయించడం వల్ల సమయం కలిసి రావడంతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందని రైతులు పేర్కొంటున్నారు. కూలీలతో కోతలు కోయించడానికి, పన కట్టి నూర్పుడి చేయించడానికి ఎకరాకు దాదాపు రూ.12 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు.

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన



చాట్రాయి: విద్యార్థులు విద్యా హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు కోర్టు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మోతీలాల్ అన్నారు. చాట్రాయి జెడ్పీ హైస్కూల్‌లో బాలల హక్కులు–పరిరక్షణ అంశంపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అత్తునూరి శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం పి.రవీంద్ర మాట్లాడుతూ భారత రాజ్యాంగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

డ్రెయినేజీ మరమ్మతు పనులు ప్రారంభం



విస్సన్నపేట: స్థానిక శివాలయం వీధిలో డ్రెయినేజీ మరమ్మతు పనులను గురువారం చేపట్టారు. రహదారికి ఒక వైపు తూరల ఏర్పాటు, మరో వైపు సైడ్ వాల్స్ నిర్మాణం చేసి చెరువు వద్దకు మురుగు నీరు చేరేలా పనులు చేపట్టామని పంచాయతీ ఈఓ, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ హరికృష్ణ కుమార్ తెలిపారు. గ్రామంలోని వార్డుల్లో డ్రెయినేజీ సమస్య తలెత్తకుండా తూరలు ఏర్పాటు చేస్తున్నామని సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి చెప్పారు. సత్తుపల్లి రోడ్డులో డ్రెయినేజీ మరమ్మతు పనులను ఆమె పర్యవేక్షించారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

నూజివీడు: వీధి వ్యాపారులు డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని యూనియన్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ మురళి అన్నారు. పట్టణంలోని రామయ్యమ్మరావుపేటలో వీధి వ్యాపారులకు గురువారం మెప్మా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫీల్డ్ ఆఫీసర్ మాట్లాడుతూ వీధి వ్యాపారులు నగదు రహిత లావాదేవీలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. పీఎం స్వనిధి కింద రుణాలు తీసుకున్న వీధి వ్యాపారులు వాటిని సద్వినియోగం చేసుకుని తిరిగి సక్రమంగా చెల్లిస్తే రెండోసారి రుణ మొత్తాన్ని పెంచి రుణం ఇస్తామన్నారు. మొదటి విడతలో రూ.10 వేలు, రెండో విడతలో రూ.20 వేలు, మూడో విడతలో రూ.50 వేలు రుణాన్ని ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూబీవీ మేనేజర్ ఇర్ఫాన్ మహ్మద్ బాషా, మెప్మా సీఎంఎం లటికే నాగోజీ పాల్గొన్నారు.

చిన్నారికి కానిస్టేబుల్ రక్తదానం

చాట్రాయి: ఫోన్ ద్వారా అడగ్గానే స్పందించి ఓ చిన్నారి ప్రాణాలను పోలీస్ కానిస్టేబుల్ రక్తదానం చేసి కాపాడాడు. వివరాల ప్రకారం.. విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 11 నెలల పాపకు ప్లేట్‌లెట్స్ పడిపోయాయి. ఏబీ పాజిటివ్ రక్తం కావాల్సి ఉంది. చాట్రాయి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విష్ణుని పాప బంధువులు ఫోన్ ద్వారా సంప్రదించి విషయం తెలిపారు. వెంటనే స్పందించిన విష్ణు విజయవాడ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. సింగిల్ డోనర్ ద్వారా సేకరించి వేరు చేసిన రక్తాన్ని పాపకు అందిస్తారని, ఇప్పటివరకు 9 సార్లు రక్త దానం చేశానని దాత విష్ణు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



తిరువూరు: స్థానిక పాటి మీద దాసాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి గురువారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. దారా వెంకట లక్ష్మీప్రసాద్ రూ.25,116, జవాజి రంగారావు రూ.25,116, దొడ్డా వీరరాఘవరావు రూ.10,116, బడుగు వీరాంజనేయులు రూ.10, 101, కంచి చిన్న అంజయ్య రూ.50,116 విరాళాలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు అందజేశారు. 2025 ఫిబ్రవరిలో ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

తిరువూరు: తిరువూరు సర్కిల్‌లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న యువకుడిని తిరువూరు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. గంపలగూడెం మండలం గుళ్లపూడికి చెందిన పంది నాగరాజును లక్ష్మీపురం పాలశీతల కేంద్రం వద్ద అరెస్టు చేసి అతని నుంచి ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని తిరువూరు కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

తిరువూరు ఆర్డీఓ మాధురి ఆదేశం



లక్ష్మీపురం రైస్‌మిల్లులో ధాన్యం తనిఖీ చేస్తున్న ఆర్డీఓ మాధురి

తిరువూరు: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని తిరువూరు ఆర్డీఓ కె. మాధురి సిబ్బందిని ఆదేశించారు. తిరువూరులో, లక్ష్మీపురంలో రైస్ మిల్లులను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలలో లోడ్ చేసిన ధాన్యం లారీలు మిల్లులకు ఆలస్యంగా వస్తున్న ఘటనలపై ఆరా తీశారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ జరిగే విధానంలో మార్పులు చేయాలని, లారీలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉన్నందున ఎటువంటి జాప్యం చేయకుండా మిల్లులకు చేర్చాలని ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన నిర్ణీత గడువులోగా బిల్లులు చెల్లించాలని సూచించారు. పౌరసరఫరాల విభాగం డెప్యూటీ తహసీల్దార్ శ్వేత, వీఆర్వోలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం సేవలు వినియోగించుకోవాలి
మైలవరం: ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు ఆర్డీఓ మాధురి అన్నారు. రెడ్డిగూడెం మండలంలోని మద్దులపర్వ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులకు అమ్ముకుని నష్టపోవద్దన్నారు. తేమ శాతం 18 ఉంటే ఒక కిలో, 19 శాతం ఉంటే రెండు కిలోలు, 20 శాతం ఉంటే మూడు కిలోలు, 21 శాతం ఉంటే 4 కిలోలు, 22 శాతం ఆ పైన ఎంత తేమ శాతం ఉన్నా 5 కిలోలు వడ్లు తగ్గిస్తారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీలాదేవి, వ్యవసాయాధికారి, పీడీఎస్ డీటీ, రెవెన్యూ అధికారి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్

సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్

మైలవరం: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ వినియోగంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు విద్యుత్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కన్స్యూమర్స్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ (సీజీఆర్ఎఫ్) చైర్మన్ ఎస్. విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. మైలవరం ఎస్వీఎస్ కల్యాణ మండపంలో విజయవాడ సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. సదస్సులో డివిజన్ పరిధిలో ఆరుగురు వినియోగదారులు తమ ఫిర్యాదులను రాత పూర్వకంగా అధికారులకు సమర్పించారు. వీటిలో నాలుగు ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని అధికారులకు చైర్మన్ సూచించారు. మిగిలిన రెండు ఫిర్యాదులు ఈ డివిజన్ పరిధిలోకి రానందున వాటిని ఎస్ఈని పరిశీలించమని సూచించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు ఎం. మురళీమోహన్‌రావు, విజయవాడ రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. వసంతరావు, మైలవరం డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ. సుధాకర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

కౌలు రైతు సంఘం నేతల డిమాండ్



కౌలు రైతు రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాష్ట్ర కౌలు రైతు సంఘం నేతలు

ముసునూరు: పంటలకు గిట్టుబాటు ధరలు రాక, అప్పుల పాలై ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. రెండు రోజుల కిందట నూజివీడు మండలం లీలానగర్‌లో ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందిన రమణక్కపేట వాసి నాగబోయిన రాజశేఖర్ కుటుంబ సభ్యులను ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి దొంత కృష్ణ, జిల్లా నేత నిమ్మగడ్డ నరసింహతో కూడిన ప్రతినిధుల బృందం గురువారం పరామర్శించారు. నాయకులు మాట్లాడుతూ కౌలు రైతు రాజశేఖర్‌పై వృద్ధురాలైన తల్లి, భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఆధారపడి ఉన్నారన్నారు. గత 15 ఏళ్లుగా భూమిని కౌలుకు తీసుకుని విత్తన మొక్కజొన్న పంట పండిస్తున్నాడని చెప్పారు. నాణ్యమైన విత్తనాలు ఇవ్వకుండా సీడ్ ఆర్గనైజర్ల మోసాలతో పంట దిగుబడి రాక, మరో వైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక ఏటేటా అప్పులు పెరిగిపోయాయన్నారు. దీనికి తోడు ఐదెకరాల మామిడి తోట కూడా కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడని చెప్పారు. దీంతో 10 లక్షలకు పైగా అప్పులయ్యాయని, కౌలు కార్డు లేక పంట రుణాలు తీసుకునైనా అప్పులు తీర్చే అవకాశం లేకపోవడంతో యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడని వివరించారు. ఈ ఘటనపై తక్షణం ప్రభుత్వం స్పందించి కౌలు రైతు కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, విద్యావంతురాలైన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పిల్లల చదువులకు అవసరమైన ఖర్చులు ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న దాతలు

నూజివీడు: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యంగా ఉన్న వారు నాలుగు నెలలకొకసారి రక్తదానం చేయవచ్చని పట్టణంలోని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. నరేంద్రసింగ్ అన్నారు. పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలేజ్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సెస్‌లో నూజివీడు, గుడివాడ ఏరియా ఆస్పత్రులు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎన్ఎస్ఎస్ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నరేంద్రసింగ్ మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. శిబిరంలో 30 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ నవీన లావణ్యలత, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ బి.సురేష్, గుడివాడ, నూజివీడు ఆస్పత్రుల వైద్యులు విజయశ్రీ, కీర్తి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్లు టి.నాగరాజు, షేక్ అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నూజివీడు: గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. గొల్లపల్లి పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాస్ గౌతమ్ విద్యార్థులకు పరీక్షలు చేసి వారికి పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. దీనిలో భాగంగా విద్యార్థుల ఎత్తు, బరువు, రక్తశాతం తదితర పరీక్షలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ మహిమ, ఏఎన్ఎం ప్రిస్కిల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పుల్లూరు వంతెన



పుల్లూరులో ప్రమాదకరంగా ఉన్న వంతెన

పుల్లూరు(మైలవరం): మైలవరం మండలంలోని పుల్లూరు, చిలుకూరువారిగూడెం గ్రామాల మధ్య బుడమేరు వాగుపై ఏర్పాటు చేసిన లో లెవెల్ వంతెన ఇటీవల వచ్చిన వరదలకు కుంగిపోయింది. ఈ వంతెనపై రెండు గ్రామాలకు చెందిన రైతులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు రాకపోకలు సాగిస్తుంటారు. ఉభయ కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లాలకు చెందిన పలువురు భక్తులు ఈ వంతెన మీదుగా జమలాపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి తమ మొక్కులు తీర్చుకునేందుకు వస్తుంటారు. ఈ లో లెవెల్ వంతెనపై ప్రజలు, వివిధ రకాల వాహనాలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాగు ప్రవాహానికి కొంతమేర వంతెన విరిగిపోయింది. దీనితో వంతెనకు ఇరువైపులా రాకపోకలు సాగించకుండా అడ్డుగోడలు కట్టారు. పుల్లూరు శివారు చిలుకూరువారిగూడెం గ్రామస్తులు పక్క గ్రామాలకు పుల్లూరు గ్రామం నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఫర్లాంగ్ దూరం పెరగడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదమని తెలిసినా గ్రామస్తులు వంతెనపై నిర్మించిన అడ్డుగోడలు తొలగించి రాకపోకలు సాగిస్తున్నారు.
ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన మధ్యలో కొంత భాగం కుంగి మధ్యలో భారీ గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వాహన చోదకులు వంతెనపై భయంభయంగానే ప్రయాణం చేస్తున్నారు. అధికారులు స్పందించి వంతెన పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వంతెనను పునర్నిర్మించాలి



మైలవరం నుంచి పుల్లూరు వెళ్లే రహదారిలోని వంతెన ఒక పక్కన కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో పనులు ముగించుకుని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వంతెన మీదుగా గ్రామాలకు చేరుకుంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వంతెన దాటాలంటే వాగు ఉధృతికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారి నుంచే జమలాపురం వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లాల్సి ఉంది. వంతెనను పునర్నిర్మించాలి.

– చిలుకూరి కృష్ణారెడ్డి, చిలుకూరివారిగూడెం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మైలవరం: మైలవరం గ్రామ సచివాలయం పరిధిలోని 11వ వార్డు యాదవుల బజారులో 270 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ చొరవతో మంజూరైన ఎస్ఆర్ఈజీఎస్ నిధులు రూ.14 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

మైలవరం: కీర్తిరాయునిగూడెం గ్రామంలో కందుల శివన్నారాయణ అనధికారికంగా మద్యం విక్రయిస్తుండగా 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ జె. శ్రీనివాస్ తెలిపారు. నిందితుడిపై ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ముగ్గురు పాత ముద్దాయిలను మైలవరం తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి ఎదుట బైండోవర్ చేశామని చెప్పారు. దాడుల్లో ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆగిరిపల్లి: సీపీఎం మండల కార్యదర్శిగా చాకిరి శివ నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆగిరిపల్లిలోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రసాద్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఎం ఆగిరిపల్లి మండల కార్యదర్శిగా చాకిరి శివ నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా నైనవరపు ఉల్లక్కయ్య, రవీంద్ర, సుభాకరరావు, నరేష్, జంగం శౌరి తదితరులు ఎన్నికయ్యారు.

24న మాలల ఆత్మగౌరవ సభ



సమావేశంలో మాట్లాడుతున్న జోజిబాబు

ఆగిరిపల్లి: నూజివీడులో ఈ నెల 24న నిర్వహించనున్న మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని దళిత బహుజన ఏలూరు జిల్లా అధ్యక్షుడు మోగదాటి జోజిబాబు అన్నారు. గురువారం చొప్పరమెట్ల, వట్టిగుడిపాడులో మాల మహానాడు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 24న నూజివీడులో జరగనున్న మాలల ఆత్మగౌరవ సభకు మాలలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

సబ్‌స్టేషన్‌లో కోతులు మృతి: విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరువూరు: ఎ.కొండూరు మండలం కంభంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రెండు కోతులు విద్యుదాఘాతానికి గురై మరణించాయి. వాటిని తొలగించేందుకు యత్నించిన సిబ్బందిపై కోతుల గుంపు దాడి చేసింది. కోతులు పడటంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ కాగా తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎట్టకేలకు సిబ్బంది కోతులను ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

మండల పరిషత్ నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: మండల ప్రజా పరిషత్ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఎంపీపీ పాలడుగు జోత్స్న, వైస్ ఎంపీపీ బండి నాగమణి జెడ్పీ సీఈఓ కన్నమనాయుడుకు గురువారం ఫిర్యాదు చేశారు. ఆగస్టు అక్టోబర్ నెలల మధ్య భారీ ఎత్తున నిధులు గోల్‌మాల్ అయ్యాయని వారు ఆరోపించారు. దీనిపై పూర్తి ఆధారాలు సీఈఓకు అందజేశారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. స్పందించిన జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు విచారణకు ఆదేశించారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల ఆందోళన



తిరువూరు: విజయవాడలో సీనియర్ న్యాయవాది పూనూరి గౌతంరెడ్డిపై పోలీసుల దౌర్జన్యకర చర్యలను నిరసిస్తూ తిరువూరులో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి కోర్టు ఎదుట ఆందోళన నిర్వహించారు. బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ పోలీసులు న్యాయవాదులపై దౌర్జన్యాలను మానుకోవాలని, గౌతంరెడ్డిపై చేపట్టిన చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి గౌసుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో న్యాయవాదులు సంకురాత్రి జనార్దనరావు, మేకల నాగేంద్రప్రసాద్, చింతల వెంకటరెడ్డి, అత్తలూరు శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, అంజన్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.